# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 310: అనేకత్వంలో ఏకత్వం యొక్క అంతరార్థం
# మార్చ్ 9, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 1, పేజీలు 35-40 నుండి తీసికొనబడినవి

**స్వామి! ఈనాడు యావద్ ప్రపంచమంతా కలహ కల్లోలంలో మునిగి ఉంది. రోజు జాతి విచక్షణ, వర్గ వైరము, ప్రాణనష్టము, యుద్ధాల గిరించి వింటున్నాము. ఈ నాటి భక్తులికి వీటిని ఎలా తట్టుకోవాలో చెప్పండి.**

భగవాన్: ఈనాడు ఏకత్వంలో భిన్నత్వం చూసే మేధావులు ఎందరో ఉన్నారు. భిన్నత్వంలో ఏకత్వం చూసే వారు కొందరే. అందువలనే ఈనాడు ఇన్ని విరోధాలు, యుద్ధాలు, కష్టాలు, కలతలు కనబడుతున్నవి. మానవుడు దానవుడి వలె ప్రవర్తిస్తున్నాడు. అందుచేత మనుషులలో దౌర్జన్యము, రాక్షసత్వము, పశుత్వము, కౄరత్వము కనబడుతున్నవి. మానవుడు ఎప్పుడైతే భిన్నత్వంలో ఏకత్వం చూడగలుగుతాడో అప్పుడు సుఖ, సౌఖ్య, శాంతి, సంతోషాలు లభ్యమౌతాయి.

మానవులలో ప్రవహించే రక్తము ప్రపంచంలో ఎక్కడకెళ్ళినా అదే రక్తం. అందరూ పీల్చుకొనే ప్రాణవాయువు ఒక్కటే. అందరూ ఒకే భూమిపై నడుస్తారు. ఎంత ధనవంతుడికైనా, భిక్షగాడికైనా ఆకలి ఒకటే. కూల్ డ్రింక్ తాగే ధనవంతుడికైనా మంచి నీరు తాగే భిక్షగాడికైనా దాహం ఒకటే. ఆనందం అనుభవించినప్పుడు నవ్వుతారు, కష్టమొచ్చినప్పుడు ఏడుస్తారు.

మానవుని దేహము భూమి, ఆకాశం, అగ్ని, వాయువు, జలములనే పంచభూతములతో కూడియున్నది. శరీరము జడమైనది. మనము దానిలోనికి వాయువును పీలుస్తాము. మనలో ఉండే అగ్ని దేహమును వెచ్చగా ఉంచి, ఆహారమును జీర్ణింప చేస్తుంది. దేహములో ఆకాశం ఉండటబట్టే అన్ని అంగములు వాటి సరి స్థానములలో ఉంటాయి. శరీరంలో ఎక్కువ శాతం జలం కూడా ఉంది. కనుక బయట ఉండే పంచభూతాలే మన దేహములో కూడా ఉన్నవి. అందరిలో అవే పాళ్ళలో ఉంటాయి. అందరిలో ఉండేవన్నీ నీలో కూడా ఉన్నాయి. మరి నీ చేయి చాపి ఇంకొకరిని అడుక్కోవలసిన అవసరం ఏమిటి? నీలో లేనిది ఇంకొకడిలో ఏముంది? ఏమి లేదు. ఇదియే భిన్నత్వంలో ఏకత్వం యొక్క అంతరార్థం. ఇదియే అనేకత్వంలో ఏకత్వం.

ఇటువంటి ఆధ్యాత్మికమైనటువంటి ఏకత్వమును అనుభవించడమే మోక్షం. అనేకత్వం, బహుత్వం, భిన్నత్వం అనుభవించడమే ద్వైతం, బంధం, అనుబంధాలకి దారి తీస్తుంది.

పూల జాతులు వేరు పూజలొక్కటే
పశుల వన్నెలు వేరు పాలు ఒక్కటే
శృంగారములు వేరు బంగారమొక్కటే
మతములన్నియు వేరు మార్గంబు ఒక్కటే
చుక్కలన్నియు వేరు ఆకాశమొక్కటే
జాతినీతులు వేరు జన్మమొక్కటే
జీవజంతులు వేరు జీవుండు ఒక్కడే

ఇదియే ఐకమత్యము, లేక ఏకత్వము. దారములన్నీ కలిపి నేస్తేనే అది వస్త్రం అవుతుంది. ఈ విధంగా ఏకత్వమును అనుభవిస్తే తప్పక దైవత్వం పొందవచ్చు. మతం పేరు చెప్పి మనుషులు యుద్ధాలకేగుతారు. ఎంత నీచం! ఏ మతమూ అసత్యం చెప్పమని, పరులను చంపమని బోధించదు. అన్ని మతములూ ప్రేమ, సోదరత్వం, త్యాగం, శాంతి, సత్యం వంటి విలువలనే ప్రబోధిస్తాయి. మతం పేరు చెప్పి యుద్ధాలు పోరాడటం ఎంత పొరపాటు. మతులు మంచివైన మతమేది చెడ్డది?

ఉన్నది ఒకటే మతము, ప్రేమ అనే మతము. భాష, జాతి భేదాలు ఉండడం సంకుచిత భావం. ఉన్నది ఒకటే భాష, హృదయమనే భాష. కుల భేదాలు ఉండడం నీచం. నువ్వు పుట్టినప్పుడు నీ కులం పేరు బోర్డుపై వ్రాసి ఉందా? గాలిది ఏ కులం? నీటిది కులమేంటి? అగ్నిది, భూమిది కులాలేంటి? కనుక ఉన్నది ఒక్కటే కులం, మానవత్వమనే కులం. భగవంతుని పేరు చెప్పి ఎన్నో యుద్ధాలు పోరాడతారు. ఎన్ని దేవుళ్ళు ఉన్నారు? పేర్లు ఎన్ని ఉన్నా దేవుడు ఒక్కడే, సర్వజ్ఞుడు.

ఏకమ్ సత్ విప్రా బహుధా వదంతి, అంటే సత్యం ఒక్కటే, కానీ పండితులు దానిని ఎన్నో విధాల వ్యాఖ్యానిస్తారు. దైవత్వంలో ఏ భేదములూ లేవు. చిత్తశుద్ధి ఉంటే, ఏకత్వం అనుభవించగలుగుతారు. అదియే దైవత్వమునకు మార్గం. మొట్టమొదట చిత్తశుద్ధి పెంపొందించుకుంటే, ఏకత్వం అనుభవించి, దైవత్వాన్ని పొందుతారు.

**స్వామి! నిజానికి, మానవ జాతి మొత్తం దైవత్వంతో కూడి ఒకటే జాతి అయి ఉన్నా మనుషులు అందరూ ఒకే విధంగా ప్రవర్తించరెందుకు? ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా అలోచిస్తారెందుకు?**

**భగవాన్:** మానవత్వం ఒక్కటే అయి ఉన్నా మానవులు వివిధ రకాలుగా ప్రవర్తిస్తారు. ఏ ఇద్దరూ ఒకే రకంగా ఉండరు. అది ప్రకృతి యొక్క ధర్మం. తలపులు, మాటలు, చేతలు దేశ కాలముల పై ఆధారపడి ఉన్నవి. ఒక ఉదాహరణ. పచ్చి కాయ తింటే వగరుగా ఉంటింది. పండని కాయ పుల్లగా ఉంటుంది. పండు తింటే తీపిగా ఉంటుంది. మూడు ఒకే కాయ యొక్క దశలు. ముందు వగరుగా, తర్వాత పుల్లగా, ఆ తర్వాత తీయగా ఉంటుంది. ఎందువలన? కాలం గడవడం వల్ల. ఎవరో బయటి నుంచి వచ్చి ఆ పండులో పంచదార పోయలేదు. అందుకే నేనంటాను, "ఎట్టి మతియో అట్టి గతి. ఎట్టి స్థితియో అట్టి సంపత్తి."

మానవ జీవితంలో మూడు ముఖ్యమైన అంశాలున్నాయి. చేత - దేహము, తలపు - చిత్తము, స్థితి - ఆత్మ. దేహము వాంఛిస్తుంది, చిత్తము తలుస్తుంది, ఆత్మ అనుభవిస్తుంది. ఎల్లప్పుడూ విశాల హృదయం ఉండాలి. సంకుచిత భావాలు ఉండకూడదు. పరీక్షల ఫలితాలు ప్రచురించినప్పుడు, అందరూ పరీక్షలు పాస్ అయినందుకు సంతోషించవెందుకు? నీ మార్కులతో పాటు, అందరి మార్కులు చూసి సంతోషించగలిగితే అది విశాల హృదయం. నీ ఒక్కడి మార్కులు మాత్రమే చూసుకుంటే అది సంకుచిత భావం.

ఇంకొక ఉదాహరణ. ఒక గ్రూపు ఫోటోలో అందరూ బాగా పడ్డారని నీకు ఆనందమైతే అది విశాల హృదయం. నీ ఒక్కడి ఫోటో మాత్రమే చూసుకుంటే అది సంకుచిత భావం.

మానవ జన్మ మూడు గుణముల సంయోగం. ఫ్యాన్ లోని మూడు రెక్కల వలె ఈ' మూడు గుణాలు సంపూర్ణమైన యోగంలో ఉంటాయి. పచ్చడిలో చింతపండు, ఉప్పు, పచ్చిమిరప కాయలు మూడు కలిపి రుబ్బితే ఎలా కలిసిపోతాయో, మానవ జీవితంలో ఈ మూడు గుణాలు కూడా అంతే. చాలా మంది కిళ్ళీ

వేసుకుంటారు. అందులో ఆకు, వక్క, సున్నం మూడు ఉంటుంటాయి. ఒకటి ఆకుపచ్చ రంగు, ఒకటి గోధుమ రంగు, ఒకటి తెల్ల రంగులలో ఉంటాయి. మూడు కలిపి నమిలినప్పుడు నోరు ఎర్ర రంగులో పండుతుంది.

అదే విధంగా మానవ జన్మలో మూడు గుణాలు కలిసి ఉంటాయి. కానీ ఆధ్యాత్మికంగా, ప్రధానముగా, మూలాధారంగా, జీవి అనగా సత్, చిత్, ఆనందాలతో కూడినది. సత్, చిత్ కలిస్తే ఆనందం లభిస్తుంది.

ఒక ఉదాహరణ. నీరు, బెల్లం విడి విడిగా తీసికొని కలిపితే, అది బెల్లమూ అవదు, నీరూ అవదు. పానకం అవుతుంది. నీరు సత్ అయితే, బెల్లం చిత్ అయితే, ఆనందమే పానకం. త్రిగుణములు, సత్ చిత్ ఆనందములు, దేహము, మనస్సు, బుద్ధితో కలిసి, బాహ్య ప్రపంచమనే ప్రవృత్తితో ప్రతిస్పందిస్తే అనేకత్వానికి, బహుత్వానికి, భిన్నత్వానికి దారి తీస్తుంది.

ధన్యవాదములు! వచ్చే వారం మరి కొన్ని ఉపదేశములతో మళ్ళీ కలుద్దాం!

ఓం సాయి రాం!